నిధుల్లేక నిలిచిన భవన నిర్మాణాలు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు


బాన్సువాడలో అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్

బాన్సువాడ: అసంపూర్తిగా కనిపిస్తున్న ఈ నిర్మాణం బాన్సువాడ మున్సిపాలిటీలోని పాత వీక్లీ మార్కెట్‌లో చేపట్టిన సమీకృత మార్కెట్ భవనానిది. చికెన్, మటన్, చేపలు వంటి మాంసాహార ఉత్పత్తులన్నీ వినియోగదారులకు ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో రూ.2 కోట్ల వ్యయంతో తలపెట్టిన ఈ నిర్మాణ పనులు 2021 డిసెంబర్‌లో ప్రారంభమయ్యాయి. జీ- ప్లస్1 అంతస్తు వరకు పనులు చేపట్టారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో గతేడాది పనులను నిలిపివేశారు. ఎప్పుడు పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల దుస్థితికి ప్రతిబింబించే సాక్ష్యాలివి. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన నిర్మాణానికి నిధుల్లేక ఇలా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వాటి పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు మాత్రం ఇంకా పూర్తి కావడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొంత మేర చేపట్టిన బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. ఏళ్ల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో చేసేది లేక చేతులెత్తేశారు. దీంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తి కావాల్సిన గడువు సైతం ముగిసి ఏళ్లవుతుంది.

ఇదీ పరిస్థితి...

వీటి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాల్సిన బల్దియా ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు ఎంబీ రికార్డులు నమోదు చేసి బిల్లులను ట్రెజరీలో సమర్పిస్తున్నారు. అయితే ఆ నిధులు సర్కారు సకాలంలో విడుదల చేయకపోవడంతోకాంట్రాక్టర్‌పై వారు ఎలాంటి అజమాయిషీ చేయలేకపోతున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తే అప్పుడు పనులు చేస్తామనే ధోరణిలో కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. వారు చేసినప్పుడే తాము చేస్తామనేలా అధికారుల తీరు ఉంది. ఫలితంగా భవన నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. సిమెంట్, ఇసుక, కాంక్రీటు వంటి ముడిసరుకు ధరలు పెరిగి పనుల నాణ్యతపై ప్రభావం పడే అవకాశముంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదలయ్యేలా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చొరవ చూపడం లేదని, ఫలితంగా ఏళ్ల తరబడి నిర్మాణాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



మాచారెడ్డి: చుక్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం గాంధారి మండల కేంద్రానికి చెందిన చందాపురం వెంకటి గౌడ్, శ్రీదేవి దంపతులు మంగళవారం రూ.1.01 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్ కుమార్, అర్చకులు ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పశువులకు గొంతువాపు నివారణ టీకాలు తప్పకుండా వేయించుకోవాలని పశువైద్య సిబ్బంది రవీందర్ తెలిపారు. మంగళవారం కాటేపల్లిలో పశు వైద్య సిబ్బంది, గొంతువాపు నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 168 ఆవులు, 185 గేదెలకు టీకాలు వేశారు. గోపాలమిత్రలు రవీందర్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పెద్దమల్లారెడ్డిలో ధాన్యం కొనుగోలు కేంద్రం మూసివేత

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మూసివేస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ రాజాగౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ సింగిల్ విండో ఆధ్వర్యంలో 3,425 మంది రైతుల వద్ద నుంచి 60 వేల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందులో 90 శాతం రైతులకు ధాన్యానికి సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లో జమయ్యాయన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం.. పలువురికి జరిమానాలు

కామారెడ్డి టౌన్: కొత్త బస్టాండసమీపంలో నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న పలువురు వ్యాపారులకు మున్సిపల్ అధికారులు భారీగా జరిమానాలు విధించారు. మున్సిపల్ సానిటరీ అధికారులు గతంలో దాడులు నిర్వహించారు. వ్యాపారులకు నోటీసులు అందించినా మళ్లీ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగించడంతో జరిమానాలు వేసినట్లు సానిటరీ ఎస్సై రవీందర్ తెలిపారు. ఓ స్వీట్ హోం యజమానికి రూ.20వేల జరిమానా విధించారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు.

సైన్స్ ఉపాధ్యాయులను మినహాయించాలి

కామారెడ్డి టౌన్: ఆరు, ఏడు తరగతుల గణిత బోధన నుంచి సైన్స్ ఉపాధ్యాయులను మినహాయించాలని జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా బాధ్యులు సదాశివ్, చక్రపాణి, దేవదాస్‌లు మంగళవారం డిమాండ్ చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేసిన మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఒక సబ్జెక్టుకు నియమించిన ఉపాధ్యాయుడు మరో సబ్జెక్ట్ బోధనలో పాలు పంచుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మద్నూర్: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మద్నూర్, డోంగ్లీ రెండు మండలాల విత్తన, ఎరువుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారని ఏవో అన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తన బిల్‌బుక్, స్టాక్ రిజిస్టార్, విత్తనాలు, ఎరువులు ఎక్కడి నుంచి తెచ్చారో వాటి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం మద్నూర్, మేనూర్‌లోని పలు దుకాణాలను ఆయన పరిశీలించారు.

ఆధ్యాత్మికం

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



దోమకొండ: అంచనూరులో రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం ఘనంగా అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుంచి బోనాలను అలంకరించి డప్పుచప్పుల మధ్య అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం తిరుగు బోనాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి, జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బారడి పోచమ్మకు బోనాలు..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో బారడి పోచమ్మ జాతరలో భాగంగా మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు ఎత్తుకొని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు చేశారు. నైవేద్యాలు సమర్పించారు.

లక్ష్మాపూర్‌లో ..



ఎల్లారెడ్డి: లక్ష్మాపూర్ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి గ్రామస్తులు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. అమ్మవారి ఉత్సవాలలో భాగంగా బుధవారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కాలభైరవుడికి వైశాఖమాస పూజలు



రామారెడ్డి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడికి వైశాఖమాస పూజలు కొనసాగుతున్నాయి. పూజల్లో భాగంగా మూడో మంగళవారం కాలభైరవుడిని 108 రకాల కూరగాయలతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు భారీగా కాలభైరవుని దర్శించుకుని జలాభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ప్రభుగుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

రైతునగర్‌లో పోలేరమ్మ జాతర



బాన్సువాడ : బీర్కూర్ మండలం రైతునగర్‌లో మంగళవారం పోలేరమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. జాతరను మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. మొదటి రోజు పోలేరమ్మ గుడి చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన, రెండో రోజు కొండపై ఉన్న మాలక్ష్మమ్మ దగ్గర మేళతాళాలతో వెళ్లి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.

70 ఏళ్ల క్రితం రైతునగర్ ఏర్పాటు..

దాదాపు 70 ఏళ్ల క్రితం ఆంధ్ర నుంచి రైతునగర్ అనే గ్రామానికి పలువురు వలస వచ్చారు. ఒక రాయినే పోలేరమ్మ తల్లిగా భావించి ఇంటూరి అనంతయ్య అనే వ్యక్తి మొదట విగ్రహం నెలకొల్పారు. ఆనాటి నుంచి నేటి వరకు అనంతయ్య కుటుంబ సభ్యులే మొదట పోలేరమ్మకు పూజలు చేసి జాతరను ప్రారంభిస్తారు. గతంలో ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉండేది. కాలక్రమేనా ఎడ్లు లేకపోవడంతో ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏడాది గుంటూరు జిల్లా కొండపాటూరు గ్రామంలో పోలేరమ్మ జాతర చేసిన తర్వాత రోజున రైతు నగర్ గ్రామంలో జాతర వేడుకలు ప్రారంభమవుతాయి.

గ్రామ పంచాయతీల్లో ఆస్తుల పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని సంగం, నెమ్లి గ్రామాల్లో గల గ్రామ పంచాయతీ ఆస్తులను మంగళవారం ఎంపీవో రాము పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, కంపోస్టు షెడ్లు, నర్సరీలను పరిశీలన చేశారు. ప్రతి మొక్కను కాపాడాలన్నారు. నర్సరీలలో నాటిన మొక్కలను హరితహారం కార్యక్రమానికి అందించాలన్నారు. కార్యదర్శులు మానస, అనిల్ ఉన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఎంపీడీవో, ఎంపీవోలు పర్బన్న, ప్రకాష్‌లు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నాలుగు రోజులుగా నీరు రాకపోవడంతో కాలనీవాసులు రాస్తారోకో చేయడంతో స్పందించిన ఎంపీడీవో, ఎంపీవోలు సిబ్బందితో కలిసి బోరుకు మరమ్మతులు చేయించారు. అనంతరం కాలనీవాసులకు నీటి సరఫరాను చేసినట్లు ఎంపీవో తెలిపారు.

పుస్తకాలు విక్రయిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు స్కూళ్లలో ప్రభుత్వ స్కూల్‌లలో పంపిణీ చేసే పుస్తకాలను, అలాగే యూనిఫాం, ఇతర సామగ్రిని విక్రయిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సాక్ష్యాలతో డీఈవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన


కొండాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఇస్సానగర్‌లో ..

రాజంపేట: మండల కేంద్రంతో పాటు ఆర్గొండ, కొండాపూర్, తలమడ్ల గ్రామాలలో మంగళవారం రైతులకు విత్తన కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్గొండ సొసైటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి సుప్రజ్యోతి మాట్లాడుతూ.. రెతులు విత్తనాలు కొనేముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. క్రిమి సంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో గడువు తేదీ, విత్తన రకం తదితర వివరాలను గమనించాలని తెలిపారు. లూజు విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, భద్రంగా దాచుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఏఈవోలు శ్రీకాంత్ శిల్ప, మౌనిక, మన్విష ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలి

బీబీపేట: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని బీబీపేట మండలం ఇస్సానగర్, మాందాపూర్, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాఘవేంద్ర, సాగర్, లతలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రైతులు ఖరీఫ్ సీజన్లో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయశేఖర్ సూచించారు. మంగళవారం నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి, తాండూర్ గ్రామాలలో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఈవోలు నిఖిత, రాజశేఖర్‌లు ఉన్నారు.

రిజిస్టర్‌లో నమోదు చేయాలి

బీబీపేట: విత్తనాల అమ్మకాలను రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. డీలర్లు సైతం నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. ఏఈవో రాఘవేంద్ర ఉన్నారు.

దోమకొండలో..

దోమకొండ: రైతులకు కల్తీ విత్తనాల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి కృష్ణారెడ్డి ఉన్నారు.


రాఘవపల్లిలో మాట్లాడుతున్న ఏవో విజయశేఖర్


బీబీపేటలో దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏవో

అంగన్‌వాడి గుడ్లపై విచారణ


గుడ్లను పరిశీలిస్తున్న అంగన్‌వాడి సూపర్‌వైజర్

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మంగళవారం సాక్షి దిన పత్రికలో వచ్చిన 'అంగట్లో అంగన్వాడి గుడ్లు' అనే వార్తా కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం అంగన్వాడీ సూపర్‌వైజర్ వాణి మండల కేంద్రంలో గల కిరాణా షాపులను పరిశీలించారు. గుడ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించగా..వారు రామాయంపేట్ నుంచి సరఫరా చేస్తారని జవాబు ఇచ్చారన్నారు. గుడ్లపై కేవలం నీలం రంగు మాత్రమే ఉందని, లోగో మాత్రం లేదని, స్థానిక అంగన్‌వాడీలకు సంబంధం లేదని ఆమె తెలిపారు. అంగన్వాడీ గుడ్ల లోగో రంగు కిరాణా షాపుల్లో అమ్మే గుడ్లపైకి ఎలా వచ్చిందని పలువురు చర్చిస్తున్నారు. అధికారులు మాత్రం నామ మాత్రపు విచారణ చేపట్టి తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి లోతుగా విచారణ చేస్తే అసలు నిందితులు బయటకు రావొచ్చు.

తాగునీటి కోసం ఆందోళన


రాస్తారోకో చేస్తున్న స్థానికులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో స్థానికులు తాగునీటి కోసం మంగళవారం హైద్రాబాద్- బోధన్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి రాస్తారోకో చేశారు. పట్టణంలోని సాయినగర్ కాలనీలో నాలుగు రోజులుగా తాగు నీరు రావడం లేదని పంచాయతి కార్యదర్శికి ఫోన్లో ఫిర్యాదు చేయగా కాలనీవాసులను దుర్భాషలాడారని, దీంతో కాలనీవాసులు తాగునీటి సరఫరా చేయాలని కోరుతూ ప్రధాన రహదారిపై కూర్చుని ధర్నా చేశారు. కాలనీవాసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ముందు సైతం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. నీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు కాలనీవాసులకు సముదాయించడంతో రాస్తారోకో విరమించారు.

బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలి

- రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి


నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి: గంగమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి వర్షాకాలంలోపు అందుబాటులోకి తేవాలని రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ సహకారంతో గర్గుల్, గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి పనులు మొదలుపెట్టినా కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత పనుల్లో ఆలస్యం జరుగుతుందన్నారు. ఈ గంగమ్మ వాగు బ్రిడ్జి మీదుగా అనేక గ్రామాల ప్రజలు కామారెడ్డికి ప్రయాణాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో వర్షాకాలం రాకముందే గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు లాగాల మైపాల్, సుధాకర్, జంగం లింగం, సాయి రెడ్డి, హనుమవోళ్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల విక్రయం ప్రారంభం


పెద్దమల్లారెడ్డిలో విక్రయిస్తున్న విండో చైర్మన్

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పెద్దమల్లారెడ్డి సింగిల్ విండోల్లో సబ్సిడీపై జీలుగ , పచ్చిరొట్ట విత్తనాల విక్రయాలను సింగిల్ విండో చైర్మన్లు గంగళ్ల భూమయ్య, రాజాగౌడ్‌లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సు ప్రతులను తీసుకు వచ్చి సబ్సిడీపై విత్తనాలను తీసుకెళ్లాలని కోరారు.

ఒక్క బస్తా 2.20 ఎకరాలకు..

రామారెడ్డి: ఒక బస్తా జీలుగ 2.20 ఎకరాలకు సరిపోతుందని సదాశివనగర్ మండల వ్యవసాయాధికారి ప్రజాపతి అన్నారు. సదాశివనగర్ మండలంలో అన్ని సొసైటీ కేంద్రాల్లో నేడు జీలుగ, జనుము విత్తనాల పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలను ఆన్‌లైన్ పద్ధతిలో ఇస్తున్నామన్నారు. సదాశివనగర్ మండలానికి 296.9 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 120 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చినట్లు తెలిపారు.

బాధితులకు కిరాణా వస్తువుల పంపిణీ


కిట్లు అందిస్తున్న ఎంపీపీ నీరజ

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామంలో ఆదివారం కురిసిన అకాల వర్షం, గాలివాన బీభత్సంతో నష్టపోయిన బాధితులను మంగళవారం బాన్సువాడ ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి పరామర్శించారు. సుమారు 25 ఇళ్లు దెబ్బతిని నిరాశ్రయులు కావడంతో వారికి సొంత ఖర్చుతో కిరాణా వస్తువులు అందజేశారు. పప్పులు, మంచి నూనె, కారం, చింతపండు, ఉప్పు తదితర వస్తువుల కిట్‌లను గ్రామ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా కృషి చేస్తామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఆమె వెంట నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, పర్వంరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, సయ్యద్ జలీల్, కార్యదర్శి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మొరం దందా

- పట్టించుకోని అధికారులు


కొల్లూరులో మొరం తవ్వుతున్న దృశ్యం

నస్రుల్లాబాద్: బాన్సువాడ నియోజకవర్గంలో మొరం అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఇష్టారీతిన మొరం తవ్వుతూ జేబులు నింపుకుటున్నారు. ఇదంతా అధికారులకు తెలియకుండా సాగడం లేదని వ్యాపారులు బాహాటంగానే అంటున్నారు. పొలాలు చదును చేస్తున్నామని చెబుతూ మొరం తరలిస్తున్నారు. నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి, మైలారం, మిర్జాపూర్, బీర్కూర్ మండలం కిష్టాపూర్, రైతునగర్, బైరాపూర్, బాన్సువాడ మండలం కొల్లూర్ గ్రామాల్లో నిత్యం మొరం దందా సాగుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండానే మొరం తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. మైనింగ్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమాచారం..

ఇంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లలో అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హేమచందర్ మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో అడ్మిషన్ల కోసం గోపాల్‌పేట్ జెడ్పీ పాఠశాలలో కాని లేదా ఆన్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

నేడు పచ్చిరొట్ట ఎరువులు, జనుము విత్తనాల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో బుధవారం పచ్చిరొట్ట ఎరువులు, పెద్దజనుము విత్తనాలను రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు. తాడ్వాయి సింగిల్ విండో, దేమికలాన్ సింగిల్ విండో కార్యాలయం, ఆగ్రోస్ రైతు సేవకేంద్రంలో ఉదయం 8 గంటలకు సరఫరా చేస్తామని వెల్లడించారు. అవసరం ఉన్నవారు పట్టా పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబరుతో వచ్చినట్లయితే మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అనుమతి ఇస్తామన్నారు. 40 కిలోల సంచిని రాయితీపై రూ.1448కి ఇస్తున్నట్లు చెప్పారు.